క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



అప్పలనాయుడు కుటుంబాన్ని పరామర్శిస్తున్న గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: మండలంలోని కృష్ణాపురం పంచాయతీ గొర్లెపేటకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు మహంతి అప్పలనాయుడు తండ్రి ఇటీవల మరణించడంతో ఆయన కుటుంబాన్ని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ మంగళవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో రణస్థలం మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసరావు, నియోజకవర్గ బీసీ, యూత్, విద్యార్థి, ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షులు మజ్జి రమేష్, దన్నాన హరి, ముద్దాడ రాజశేఖర్, నేతల కృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెరువు కబ్జాపై ఫిర్యాదు



సమావేశమైన కిల్లిపాలెం గ్రామస్తులు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని కిల్లిపాలెం పంచాయతీ ఎచ్చెర్ల వీధికు చెందిన వందేళ్ల తంగివారి చెరువును అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు తప్పుడు పత్రాలు సృష్టించి కబ్జాకు పాల్పడ్డారని గ్రామస్తులంతా ఏకమై మంగళవారం రెవెన్యూ అధికారులు, రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో ఈ చెరువు ద్వారానే వ్యవసాయ పొలాలకు నీరు అందించేవారిని, పశువులకు తాగడానికి కూడా ఈ చెరువునే ఉపయోగించేవారిని, అధికారులు స్పందించి ఆక్రమణను అడ్డుకోవాలని కోరారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

రణస్థలం : ఉచిత వైద్య శిబిరాలు పేద ప్రజలకు వరంలాంటివని ఇడదాసుల విద్య, వైద్య ఆరోగ్య ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు ఇడదాసుల వెంకట సత్యనారాయణ అన్నారు. రణస్థలంలోని సూర్య ఆసుపత్రి ఆవరణలో జిల్లా అంధత్వ నివారణా సంస్థ సౌజన్యంతో ఇడదాసుల విద్య ఆరోగ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ నిర్వాహకులు కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 128 మంది రాగా శస్త్రచికిత్స నిమిత్తం 33 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో వైద్యులు యశ్వంత్, సేవా ఫౌండేషన్ అధ్యక్షులు ఇడదాసుల తిరుపతిరాజు, సభ్యులు బలివాడ శ్రీనివాసరావు, చిన్ని రమణ, బేతా నర్సింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయ దంపతుల ఔదార్యం



సాయం అందజేసిన విశ్రాంత ఉపాధ్యాయులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): నిరుపేద నాయీబ్రాహ్మణ, ఇతర కులాల వృద్ధులు, దివ్యాంగులు, క్యాన్సర్, కిడ్నీ డయాలసిస్, గుండె జబ్బులు, పక్షవాతం, పోలియో తదితర వ్యాధులతో బాధపడుతున్న సుమారు 50 మందికి ఒక్కొకరికి రూ.5వేలు చొప్పున రూ.2.50లక్షలు ఆర్థిక సాయాన్ని విశ్రాంత ఉపాధ్యాయ దంపతులు దొంతికుర్తి త్రినాథరావు, నిర్మల అందించారు. శ్రీకాకుళం నగరంలోని మహాత్మా జ్యోతిరావు పూలే కాలనీలో జిల్లా నాయీ బ్రాహ్మణ సామాజిక భవనంలో మంగళవారం ఈ సాయం అందజేశారు. కార్యక్రమంలో నగర నాయీబ్రాహ్మణ అధ్యక్షుడు కుప్పిలి నాగరాజు, మాజీ కార్యదర్శి కూర్మపు కృష్ణప్రసాద్, ఆచంటి శ్రీనివాస్, చిగురువలస కన్నయ్య, పట్టణ కార్యదర్శి గోరింట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: త్రైత సిద్ధాంత ప్రబోధ సమితి, హిందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రబోధానంద యోగ పీఠం వ్యవస్థాపకులు ఆచార్య ప్రబోధానంద యోగేశ్వర స్వామి రచించిన 100 ఆధ్యాత్మిక రచనలను ప్రచారం చేశారు. త్రైత సిద్ధాంత భగవద్గీతను ప్రతిఒక్కరూ చదవాలన్నారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు సంతోష్‌కుమార్, దుర్గారావు, వెంకటరావు, రామకృష్ణ, అప్పన్న, వాసుదేవరావు, లక్ష్మీ, అప్పలనాయుడు పాల్గొన్నారు.

కోదండ రాముడికి..
దాతలే దిక్కు!

- అభివృద్ధికి నోచుకోని కోదండ రామాలయం
- ఆస్తులున్నా ఆదాయం సున్నా
- దాతల సాయం కోసం ఎదురుచూపు



రంగులు లేక వెలవెలబోతున్న ఆలయ శిఖరం



శిథిలావస్థలో ప్రధాన ద్వార గోపురం

శ్రీకాకుళం కల్చరల్: నగరం నడిబొడ్డున పాలకొండ రోడ్డులోని కోదండ రామాలయం అభివృద్ధికి నోచుకోక జీర్ణావస్థకు చేరుకుంటోంది. దేవదాయశాఖ ఆధీనంలో కొనసాగుతున్న ఈ ఆలయానికి 200 ఏళ్లకు పైగా చరిత్ర ఉంది. అయినప్పటికీ దశాబ్దమున్నరగా నిర్వహణ కరువై రంగులు వెలిసిపోయి దయనీయంగా మారింది. గతంలో పాలకొండ రోడ్డు విస్తరణ సమయంలో ఆలయ ప్రహరీతో పాటు లోపల కొంతభాగాన్ని తొలగించారు. అనంతరం పునరుద్ధరణకు ప్రభుత్వం కొంత సొమ్ము మాత్రమే ఇవ్వడంతో ప్రహరీ, ప్రధాన ద్వార నిర్మాణం చేశారు. తర్వాత ఆలయాన్ని పట్టించుకోవడం మానేశారు.

కోర్టు పరిధిలో ఆస్తులు..

కోదండ రామాలయం నిర్మాణ దాత అప్పట్లో ఆలయ నిర్వహణ నిమిత్తం కొంత భూమిని, నగరంలో కొంత స్థలాన్ని దానంగా ఇచ్చారు. నరసన్నపేట మండలం పోతయ్యవలసలో 525 ఎకరాల స్థలాన్ని అప్పటి దాత అద్దమఱుగుల వెంకన్న పంతులు ఆలయానికి ఇచ్చారు. అందులో 480 ఎకరాలు దేవాలయానికి, మిగిలిన 145 ఎకరాలు పేద రైతులకు అప్పగించారు. అయితే రెవెన్యూశాఖ సాగు రైతులందరికీ పట్టాదారు పాసు పుస్తకాలను ఇవ్వడం, కేవలం 19 ఎకరాలు మాత్రమే దేవదాయ శాఖకు కేటాయించడంతో ఇబ్బందులు మొదలయ్యాయి. ఈ విషయమై దేవదాయశాఖ అధికారులు హైకోర్టులో కేసు వేయగా దేవదాయశాఖకు అనుకూలంగా ఉత్తర్వులు జారీ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. అదే విధంగా, రైతులకు ఇచ్చిన పట్టాదారు పాసుపుస్తకాలు చెల్లవని, వెంటనే రద్దు చేయాలని దేవదాయశాఖ అధికారులు రెవెన్యూ అధికారులకు సైతం ఫిర్యాదు చేశారు. మొత్తమ్మీద ఈ వ్యవహారం జరుగుతున్నప్పటి నుంచి రైతులు దేవదాయ శాఖకు డబ్బులు కట్టడం మానేశారు. ఫలితంగా దేవాలయం ఆదాయానికి గండి పడింది. ప్రస్తుతం నగరంలోని కొన్ని షాపులు లీజుకు ఇచ్చిన ఆదాయం మాత్రమే వస్తోంది. దాని ద్వారా వచ్చిన సుమారు రూ.5.50 లక్షల ఆదాయం కేవలం అర్చకుల జీతాలు, ఉత్సవాలు, పూజలకు మాత్రమే సరిపోతోంది.

దాతలే ఆదుకోవాలి..

పురాతన దేవాలయం కోదండ రామాలయాన్ని అభివృద్ధి పరచాలంటే ప్రస్తుత పరిస్థితులలో దాతలే దిక్కు. ఆలయం రంగులు, రిపేర్ల కోసం సుమారుగా రూ.5లక్షల మేరకు ఖర్చు అవుతుందని అంచనా. అయితే కొందరు దాతలు ముందుకు వచ్చి సుమారు రూ.40 వేలు సాయం అందజేశారు. ఆ మొత్తంతో పనులు అరకొరగా ప్రారంభం చేశారు. త్వరలో శ్రీరామనవమి వస్తోంది. దీనిని దృష్టిలో పెట్టుకొని ఆలయం బాగు చేయించాలని ఆలయ భక్తుల కమిటీ సిద్ధపడింది. అందుకు దాతలు ముందుకు రావాలని వారు కోరుతున్నారు.

దాతలు ముందుకురావాలి



ఆలయం రంగులు వెలవెలబోతున్నాయి. అక్కడక్కడా పెచ్చులు ఊడిపోతున్నాయి. దాన్ని బాగు చేయించేందుకు భక్త బృందంతో కలిసి పనులు ప్రారంభించాం. దాతలు ముందుకు వచ్చి ఆలయ అభివృద్ధిలో పాలుపంచుకోవాలి.

– బంకుపల్లి శేషాచార్యులు, ప్రధాన అర్చకులు, కోదండ రామాలయం

6న చలో విజయవాడ



రావాడ పీహెచ్‌సీ వైద్యులుకు వినతిపత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు

రణస్థలం: ఆశా కార్యకర్తలకు కనీస వేతనాలు, ఒప్పంద జీవోల అమలు కోరుతూ మార్చి 6న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు సమస్యలు పరిష్కరించాలని, చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్తున్నట్లు తెలియజేస్తూ ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో రావాడ, పాతర్లపల్లి వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పి.ఎస్.జనార్దన్‌నాయుడు, బి.వి.పి.అనూషలకు మంగళవారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా అమ్మన్నాయుడు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించాలని, ప్రభుత్వ సెలవులు, క్యాజువల్ లీవ్స్, వయో పరిమితి 62కు పెంపు, రిటైర్మెంట్ ప్రయోజనాలు, ఇన్సూరెన్స్, మట్టి ఖర్చులు తదితర ఒప్పంద జీవోల అమలు కోరుతూ జరిగే ధర్నాలో కార్యకర్తలంతా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు కాంతమ్మ, డి.మేరీ, పి.లక్ష్మి, ఎం.సుగుణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ధ్యాన శిక్షణ

శ్రీకాకుళం కల్చరల్: ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 5 నుంచి 8 వరకు హ్యాపీనెస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏఓఎల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కింజరాపు అమ్మన్నాయుడు తెలిపారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం 6 నుంచి 8.30 గంటల వరకు పెద్దపాడు రోడ్డులోని ఆర్ట్ ఆఫ్ లివింగ్ హ్యాపీనెస్ కేంద్రంలో ధ్యాన శిక్షణ తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 7989752675 నంబరును సంప్రదించాలని కోరారు.

10న త్రినాథాలయ వార్షిక కల్యాణోత్సవం

శ్రీకాకుళం రూరల్ : మండలంలోని వాకలవలసలో త్రినాథస్వామి దేవాలయం వార్షిక కల్యాణ మహోత్సవం ఈ నెల 10న నిర్వహించనున్నట్లు అర్చకులు కంచరాన పుణ్యవర్ధనరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామివారికి అభిషేకాలు, విశేష పూజలు, ప్రధాన దేవత హోమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సెలవుపై వెళ్లిన ఎంపీడీఓ

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ఎంపీడీవో సీపాన హరిహరరావు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. మంగళవారం నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు సెలవు పెట్టారు. ప్రస్తుతానికి ఇన్‌చార్జి బాధ్యతలు ఎవరికీ ఇవ్వలేదు.

ధాన్యం కొనుగోలు చేయాలి



సంతవురిటి–ధవళపేట గ్రామాల మధ్య ధాన్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

జి.సిగడాం: ధాన్యం పూర్తిస్థాయిలో కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ధవళపేట, సంతవురిటి, ఆనందపురం గ్రామాల అన్నదాతలు అధికారులకు విన్నవించారు. మంగళవారం సివిల్ సప్లయర్ అధికారి(డీఎస్‌ఓ) జి.సూర్య ప్రకాశరావు, మండల వ్యవసాయాధికారి యర్రా శారద గ్రామాల్లో పర్యటించి పొలాల్లో ఉన్న ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పొంత పొలాల్లోనే వరి కుప్పలు ఉన్నాయని, మండలం నుంచి 3వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. దీనిపై డీఎస్‌ఓ స్పందిస్తూ ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, ఎవరూ దళారులను ఆశ్రయించవద్దని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ చిత్తిరి మోహన్, మహేశ్వరరావు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు అలుగోలు లక్ష్మీనారాయణ, ముంతా హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఆధ్యాత్మిక గీతాలాపన



అన్నమాచార్య కీర్తనలు ఆలపిస్తున్న భారతీ రమేష్ బృందం



పాల్గొన్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్ : హరే కృష్ణ నామ సంకీర్తన, శ్రవణం వల్ల మనసుకు సాంత్వన కలుగుతుందని అమెరికాకు చెందిన కలకంత ప్రభు(శ్రీల ప్రభుపాదుల శిష్యులు) అన్నారు. నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో శ్రీకాకుళం ఇస్కాన్, శ్రీజగన్నాథ్ భలదేవ్ సుభద్ర మందిరం ఆధ్వర్యంలో హరేకృష్ణ ఉత్సవ్ రెండో రోజు కార్యక్రమం మంగళవారం కూడా కొనసాగింది. భారతీ రమేష్ బృందం అన్నమాచార్య కీర్తనలు ఆలపించగా..రేవతి రమణ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో..
జ్ఞానజ్యోతులు

- చిన్నారులకు సరికొత్త విద్యా బోధన
- ఇప్పటికే కార్యకర్తలకు శిక్షణ పూర్తి



అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ అందిస్తున్న డీఆర్‌పీ పిట్టా అప్పారావు



ప్రాథమిక స్థాయి విద్యపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

జి.సిగడాం:

జాతీయ నూతన విద్యా విధానం భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో సరికొత్త రూపును సంతరించుకోబోతున్నాయి. ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా మార్పు చెంది చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించనున్నారు. ఈ మేరకు అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇప్పటికే ఆరో రోజుల పాటు జ్ఞానజ్యోతి పేరిట ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. 3–5 సంవత్సరాల చిన్నారులకు కేంద్రాల్లో బొమ్మలు, ఆట, పాటలతో కూడిన విద్యను అందించేలా కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఇప్పటికే అంగన్‌వాడీ కేంద్రాల్లో 85 శాతం మేర పక్కాగా భవనాలు, ఇతర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశారు. తాజాగా శిక్షణకు సిబ్బందిని సిద్ధం చేశారు.

శిక్షణతో మేలు



చిన్నారులకు ప్రీ ప్రైమరీ విద్యను బోధించడానికి ఆరు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. దీనివల్ల మెరుగైన బోధన అందించేందుకు ఉపయోగపడుతుంది.

– ఎస్.సుశీల, అంగన్‌వాడీ కార్యకర్త, దేవరవలస

ప్రత్యేక శిక్షణ



చిన్నారులకు మెరుగైన విద్యా బోధన అందించేలా అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చాం. ఈ కార్యక్రమంతో క్షేత్రస్థాయిలో ఫలితాలు మెరుగుపడతాయి.

– జి.శ్రీరామదత్త, డీఆర్‌పీ, జి.సిగడాం

ప్రీప్రైమరీపై దృష్టి



జాతీయ విద్యా విధానానికి అనుకుగుణంగా ప్రీప్రైమరీ స్కూల్‌పై దృష్టి పెట్టాం. ఫౌండేషన్ లిటరసీ, న్యూ ప్రోగ్రాంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చాం.

– తమ్మినేని లక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, జి.సిగడాం

స్వచ్ఛ జలంతోనే ఆరోగ్యం



ప్రజలందరికీ స్వచ్ఛమైన తాగునీరు అందాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ కె.ఆర్.రజిని అన్నారు. వర్సిటీలో మంగళవారం గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో తాగునీటి సరఫరాపై చైతన్యర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు తాగునీరు అందిస్తుందని వీసీ చెప్పారు. కార్యక్రమంలో రెక్టార్ అడ్డయ్య, అధికారుల పాల్గొన్నారు. – ఎచ్చెర్ల క్యాంపస్

కార్మికుల భద్రతే లక్ష్యం



పరిశ్రమలో పనిచేసే కార్మికులందతా భద్రతా ప్రమాణాలు విధిగా పాటించాలని డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీరామ్‌బాబు అన్నారు. పైడిభీమవరం పారిశ్రామికవాడలోని ఏపీటోరియా, శ్రేయాస్, డాక్టర్ రెడ్డీస్, ఆరోయాక్టివా, ఆంధ్రా ఆర్గానిక్స్, ఆపర్ణ తదితర పరిశ్రమల్లో మంగళవారం 54వ జాతీయ భద్రత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఏపీటోరియా పరిశ్రమ యాజమాన్య ప్రతినిధులు కె.కమలాకర్ రెడ్డి, సంపత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. –రణస్థలం

ధర్మానను కలిసిన కన్నబాబు



మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ధర్మాన ప్రసాదరావును పెదపాడులోని ఆయన నివాసంలో పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కో–ఆర్డినేటర్ కురసాల కన్నబాబు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాకు సంబంధించి పలు విషయాలపై చర్చించారు. ఈయనతో పాటు మాజీమంత్రి ధర్మాన కృష్ణదాస్, విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు(చినశ్రీను), పార్టీ యువ నాయకుడు ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు ఉన్నారు. – శ్రీకాకుళం రూరల్

మొక్కలే ప్రాణకోటికి జీవనాధారం



మొక్కలు నాటుతున్న విద్యార్థులు, అంగన్‌వాడీలు

శ్రీకాకుళం అర్బన్: మొక్కలే ప్రాణకోటికి జీవనాధారమని ఐసీడీఎస్ శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్ట్ అధికారి శోభారాణి అన్నారు. మహిళా దినోత్సవం –కిశోర వికాసం వారోత్సవాలలో భాగంగా కృష్ణాపార్కు సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు మంగళవారం చేపలవీధి ఎం.సి.జి హెచ్ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి సంరక్షణకు, పచ్చదనానికి ప్రతి ఒక్కరు కనీసంఒక మొక్క నాటాలన్నారు. అలాగే, గొంటివీధిలోని ఠాగూర్ పాఠశాలలో విద్యార్థులతో యోగా చేయించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.లక్ష్మి, ఐసీడీఎస్ కృష్ణా పార్క్ సెక్టార్ పర్యవేక్షకురాలు పి.సీతామహాలక్ష్మి, రత్నకుమారి, సరీనా బేగం, కార్యకర్తలు సంధ్యారాణి, పైడి రాజు, సావిత్రి, నాగమణి, నళిని, చిరంజీవి, హైమ, దీప, లక్ష్మి, మంగవేణి తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్



కన్నబాబు, చిన్నశ్రీనులకు జ్ఞాపిక అందజేస్తున్న అర్చకులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ఉత్తరాంధ్ర జిల్లాల వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ కురసాల కన్నబాబు, విజయనగరం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ మజ్జి శ్రీనివాసరావు మంగళవారం ఉదయం దర్శించుకున్నారు. జిల్లా పార్టీ ప్రతినిధులంతా హాజరై ఆలయ సంప్రదాయకంగా స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అర్చకులు ఇప్పిలి ఫణీంద్రశర్మ బృందం వేదాశీర్వచనం, తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కిల్లి సత్యనారాయణ, ఆలయ పాలక మండలి సభ్యుడు మండవిల్లి రవి, పార్టీ నేతలు సాధు వైకుంఠరావు, మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, మెంటాడ స్వరూప్, ఎన్ని ధనుంజయరావు, ద్వారపు అజిత్ తదితరులు పాల్గొన్నారు.

మరణించినా.. మరొకరికి కంటి వెలుగై..



అంగీకారపత్రాన్ని అందజేస్తున్న శివకృష్ణ తల్లిదండ్రులు

గోపాలపట్నం: మరణించినా మరొకరికి కంటి వెలుగయ్యాడు ఓ యువకుడు. జి.సిగడాం మండలం కప్పరాం గ్రామానికి చెందిన గోకా శివకృష్ణ(34) విశాఖపట్నం జిల్లా జీవీఎంసీ 91వ వార్డు లక్ష్మీనగర్ ఈ–బ్లాక్‌లో తల్లిదండ్రులు సోమేష్, దమయంతితో కలిసి ఉంటున్నాడు. క్షణికావేశంలో సోమవారం ఆ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. తీరని దుఃఖంలో ఉన్నప్పటికీ, శివకృష్ణ తల్లిదండ్రులు సోమేష్, దమయంతి మానవత్వం చాటుకున్నారు. తమ కుమారుడు మరణించినా, మరొకరికి కంటి వెలుగు నింపాలని నిర్ణయించుకున్నారు. మోసిన్ ఐ బ్యాంక్ నిపుణులు హాజరై శివకృష్ణ నేత్రాలను సేకరించి, కుటుంబ సభ్యులకు అంగీకార పత్రాన్ని అందజేశారు. శివకృష్ణ కుటుంబ సభ్యులకు డాక్టర్ వాణి కృతజ్ఞతలు తెలిపారు.